
సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 12 । అక్టోబర్ । 2025



సాహిత్య కిరణం..
తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ప్రవాహాన్ని సృష్టించారు భల్లునాయక్‌తండాకు చెందిన ఆచార్య సూర్యాధనంజయ్.
- 8లో



భవిష్యత్తుకు ఉపకారం
పేద విద్యార్థులకు ఉపకారం వేతనాలు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ అమలు చేస్తోంది.
- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	590 అడుగులు
ఇన్‌ఫ్లో	:	1,00,729 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	1,00,729 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,536 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	10,040 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	7,353 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	1,200 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

పోలీస్ శాఖపై నమ్మకం పెంచాలి : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడికి నమ్మకం పెరిగేలా పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశించారు. శనివారం సూర్యాపేటలోని పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పోలీస్ శాఖ అత్యాధునికమైన సాంకేతికత కలిగి ఉందన్నారు. కేసుల దర్యాప్తులో సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుంటూ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. పోలీసులు నిత్యం ప్రజలతో ఉంటూ వారికి రక్షణ కల్పించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీలు రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, రవి, నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ హరిబాబు, సీఐలు రాజశేఖర్, వెంకటయ్య, నాగేశ్వరరావు, శివశంకర్, రామకృష్ణారెడ్డి, చరమందరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలి

సూర్యాపేటటౌన్ : మార్చి–2024 నుంచి రిటైరైన ఉద్యోగుల రిటైర్‌మెంట్ బెనిఫిట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.కోటయ్య, ప్రధాన కార్యదర్శి సుభాని కోరారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.బెనిఫిట్స్ అందని కారణంగా పిల్లల పెళ్లిళ్ల చెయ్యలేక, అప్పులు తీర్చలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఉపేందర్, దశరథరామారావు, జ్ఞానసుందర్, లింగయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

జూమ్ మీట్‌కు జిల్లా రైతులు

నడిగూడెం : దేశ రాజధాని ఢిల్లీలో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ పీఎం ధన్–ధాన్య కృషి యోజన పథకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు హైదరాబాద్‌లోని ఐసీఏఆర్–అగ్రికల్చర్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (అటారి) కేంద్రంలో ఏర్పాటు చేసిన జూమ్ మీట్‌కు జిల్లాకు చెందిన ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పలువురు రైతులు హాజరయ్యారు. కార్యక్రమంలో అటారి డైరెక్టర్ మీరా, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్.జీవీ ప్రసాద్, కేవీకే ప్రతినిధి సంతోష్, రైతులు సోమిరెడ్డి వెంకట్‌రెడ్డి, సోమిరెడ్డి పెద వెంకటరెడ్డి, మంక్య, కోట్యా, సైదా, భిక్షం, సీనా పాల్గొన్నారు.


పీఎం జూమ్ మీట్‌ను వీక్షిస్తున్న జిల్లా రైతులు

పసిడి పరుగులు



- రికార్డు స్థాయిలో పెరుగుతున్న బంగారం ధరలు
- రూ.1.24 లక్షలు దాటిన పది గ్రాముల ధర
- కొనలేనిస్థితిలో పేద, మధ్యతరగతి వర్గాలు
- పెళ్లిళ్లలో తగ్గుతున్న నగల ధగధగలు


షాపులో బంగారు ఆభరణాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

సూర్యాపేట అర్బన్ : బంగారం అంటే కేవలం ఆభరణం మాత్రమే కాదు భద్రత, సంపదగా భావిస్తారు భారతీయులు. ధర ఎంత పెరిగినా పండగలు, పెళ్లిళ్లు, శుభకార్యాలు బంగారం లేకుండా జరిగే పరిస్థితి ఉండదు. ఒకప్పుడు చాలా తక్కువకు కొనుగోలు చేసిన పసిడి ధర నేడు పేద, మధ్యతరగతి వర్గాలకు అందనంత పైకి ఎగబాకింది. ప్రస్తుతం సూర్యాపేట మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,24,710 కాగా 22 క్యారెట్ల ధర 10 గ్రాములకు రూ.1,14,400 పలుకుతోంది. వెండి ధరలు కూడా అంతేవేగంగా పెరిగి కిలోకు రూ.1,78,000కు చేరుకుంది. గడిచిన ఆరు నెలలతో పోలిస్తే దాదాపు 40 శాతం పెరిగినట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. 2024 దసరా పండుగ సమయంలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.78వేలు ఉండగా 22 క్యారెట్ల బంగారం ధర రూ.72 వేలు పలికింది. వెండి కిలో రూ.94 వేల వరకు ధర పలికింది. ఏడాదిలోపే 10 గ్రాముల బంగారం ధరకు దాదాపు రూ.47వేలు, కిలో వెండి రూ.84వేలకు వరకు పెరిగింది. దీంతో జనం వామ్మో.. ఇక బంగారం కొనలేం అనే పరిస్థితి దాపురించింది.

మూడు నెలల్లో భారీగా..

ఆర్థిక నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే రెండు, మూడు నెలల్లో బంగారం ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువలు, క్రూడాయిల్ రేట్లు.. బంగారం, వెండి ధరలపై ప్రభావం చూపిస్తాయంటున్నారు.

పెళ్లిళ్ల సీజన్‌లో పేద, మధ్యతరగతి వర్గాలకు కష్టమే

ప్రస్తుతం మంచి రోజులు ప్రారంభం అవ్వడంతో శుభముహూర్తాలు, వివాహాలు, గృహప్రవేశాలు, శారీ ఫంక్షన్లు, పండుగలు వరుసగా ఉండనున్నాయి. అయితే పెరిగిన బంగారం, వెండి ధరలతో వాటిని కొనలేని పరిస్థితి నెలకొంది. ఒకప్పుడు 200 గ్రాముల కొనుగోలు చేసే కుటుంబాలు ఇప్పుడు కేవలం 5 నుంచి 6 గ్రాములతో సరిపెట్టుకుంటున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు పెళ్లిళ్ల వేడుకల్లో పసిడి మెరుపులు లేకుండానే వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలను వాడుతున్నారు.

నగలు తక్కువ.. సేవింగ్స్ ఎక్కువ

బంగారం ధరలు కార్మికుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. 10 గ్రాములు రూ.1.24 లక్షలు దాటడంతో ఆభరణాలు చేయించుకునే వారి సంఖ్య జిల్లాలో 70 శాతానికి తగ్గింది. ఉన్నత వర్గాల వారు బంగారం బిస్కెట్లు కొనుగోలు చేస్తూ ఫ్యూచర్ ఆస్తిగా భావిస్తున్నారు. భవిష్యత్‌లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో ప్రజలు ఆభరణం కంటే.. పెట్టుబడిగా బంగారం కొనుగోలు చేసే ధోరణి పెరుగుతోంది. సంప్రదాయాలపై ఉన్న మమకారం ఒకవైపు కొనసాగిస్తూనే ఆర్థిక లాభాలను దృష్టిలో బంగారం కొంటున్నారు. ఈ పరిస్థితి చూస్తుంటే భవిష్యత్‌లో పసిడి ఒక స్టేటస్ సింబల్ కంటే పెట్టుబడి భద్రతా, భరోసా కల్పించనుంది అనడంలో ఎలాంటి సందేహం లేదని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

పసిడి ధర ఆందోళన కలిగిస్తోంది



మా అమ్మాయికి బంగారం కొనే ఆలోచనలో ఉన్నాం కానీ ధరలు తగ్గితే కొనాలని వాయిదా వేసుకుంటూ వచ్చాము. అయితే ఒక్కసారిగా బంగారం ధరలు పెరగడంతో ఆందోళనకు గురవ్వుతున్నాం. బంగారం ధర ముున్ముందు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఉన్నంతలో కొనుగోలు చేద్దామని నిర్ణయించుకున్నాం.

– కొప్పుల నిఖిల, గృహిణి సూర్యాపేట

బంగారం కొనలేము



బంగారం, వెండి ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. నెల రోజుల కిందట బంగారం కొందామని షాప్‌కి వెళ్తే ధర రూ.లక్ష దాటడంతో అవాక్కయ్యాను. ధర ఏమైనా తగ్గిందా అని శనివారం వాకప్ చేస్తే ఇంకా రూ.1.24 లక్షలు ఉందని తెసింది. దీంతో బంగారం కొనాలనే ఆలోచన విరమించుకున్నాను

– పరకాల ఉపేందర్, సూర్యాపేట

ఆభరణాలు చేయించుకునేవారు తగ్గారు



బంగారు ఆభరణాలు చేయించుకునే వారి సంఖ్య తగ్గి గోల్డ్ షాపులు వెలవెలబోతున్నాయి. గతంలో ప్రతినెలా 100 కుటుంబాలు ఆభరణాలు చేయించుకుంటే ప్రస్తుతం ఆ సంఖ్య పదికి పడిపోయింది. ఆభరణాలు చేయించుకోవడం కన్నా ఎక్కువమంది బంగారం బిస్కెట్లు కొనుగోలు చేసి భద్రపర్చుకుంటున్నారు.

– అంతటి విజయ్, బంగారం షాపు యజమాని, సూర్యాపేట

• యాదాద్రిలో సీజే


భువనగిరి శివారు మాసుకుంట వద్ద శనివారం యాదాద్రి జిల్లా కోర్టు భవన సముదాయ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్


యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో హైకోర్టు సీజేకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకుడు

పీఆర్సీ రిపోర్టును ప్రకటించాలి

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన నూతన పీఆర్సీ కమిటీ రిపోర్టును వెంటనే ప్రకటించి అమలుచేయాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్.రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సూర్యాపేటలోని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ఆఫీస్ బేరర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, జిల్లా కోశాధికారి జి.వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు ఆర్.దామోదర్, ఎస్.నాగేశ్వరరావు, బి.ఆడం, ఎస్.సోమయ్య పాల్గొన్నారు.

ఆర్డీఆర్ మరణం కాంగ్రెస్‌కు తీరనిలోటు

- రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి


నివాళులర్పిస్తున్న కోదండరెడ్డి

తుంగతుర్తి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నివాసంలో ఆయన చిత్రపటానికి కమిషన్ సభ్యులతో కలిసి కోదండరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా ఉన్న గొప్ప నేత అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. ఆయన వెంట రైతు కమిషన్ సభ్యులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్న యాదవ్, సునిల్‌కుమార్, పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వైభవంగా నారసింహుడి నిత్యకల్యాణం



గరుడ వాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు, భక్తులు


క్షేత్రంలో భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్‌కు పంచామృ తాభిషేకం గావించారు. అనంతరం స్వామి అమ్మవార్ల ఎదుర్కోలు మహోత్సవం చేపట్టి కల్యాణం జరిపారు. ఆ తర్వాత శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశంగావించి మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, నరసింహాచార్యులు, శేషగిరిరావు, భక్తులు పాల్గొన్నారు.

కటకటాల్లోకి నాయక్

- అధిక వడ్డీ ఆశ చూపి రూ.కోట్లు తీసుకుని మోసం చేసిన బాలాజీనాయక్ అరెస్టు
- డిపాజిట్ యాక్టు కింద కేసు నమోదు
- వివరాలు వెల్లడించిన నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్



వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ : అధిక వడ్డీ ఆశచూపి తన ఏజెంట్ల ద్వారా వందలాది మంది వద్ద రూ.కోట్లు వసూలు చేసి మోసం చేసిన రమావత్ బాలాజీనాయక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్ చంద్రపవార్ కేసు వివరాలు వెల్లడించారు. పీఏపల్లి మండలం వద్దిపట్ల గ్రామం పలుగుతండాకు చెందిన రమావత్ బాలాజీనాయక్ 2020లో ఐస్‌క్రీమ్ పార్లర్ వ్యాపారం కోసం బంధువుల వద్ద రూ.5 లక్షలు రూ.2 వడ్డీతో అప్పుగా తీసుకుని వ్యాపారం చేసి నష్టపోయాడు. తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని నిర్ణయించి రూ.2 వడ్డీకి ఎక్కడా డబ్బులు దొరక్కపోవడంతో రూ.6 వడ్డీ ఇస్తానని ఆశచూపి అదే గ్రామానికి చెందిన పలువురి నుంచి రూ.10 లక్షలు, రూ.5 లక్షలు వడ్డీకి తీసుకుని.. వారికి క్రమం తప్పకుండా వడ్డీ చెల్లిస్తూ నమ్మించాడు. కొంత మంది ఏజెంట్లను నియమించుకుని.. తండాలు, గ్రామాల్లో నూటికి రూ.10 వడ్డీ చెల్లిస్తానని డబ్బులు తీసుకుని వారికి ప్రామిసరి నోట్లు రాసిచ్చాడు. తీసుకున్న డబ్బుతో విలాసవంతమైన జీవితం గడిపాడు. ఖరీదైన కార్లు, విల్లాలు కొని జనాలను నమ్మించాడు. నల్లగొండలో ఐటీ హబ్ తనదేనని, హైదరాబాద్‌లో వెంచర్లు చూపించి తనవేనని జనాలను నమ్మబలికాడు.

111 వైన్ షాపులకు టెండర్లు..

అప్పులు చేస్తూ రెండేళ్ల క్రితం జరిగిన వైన్స్ టెండర్లలో జిల్లాలో 111 షాపులకు టెండర్లు వేయగా.. ఒక్క షాపు మాత్రమే దక్కింది. డిపాజిట్ల కోసమే రూ.రెండున్నర కోట్లు ఖర్చు చేశాడు. స్టాక్ మార్కెట్‌లోనూ ఇంట్రా డే ట్రేడింగ్ (ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్)చేసి రూ.12.15 కోట్లు పెట్టుబడి పెట్టాడు. ఆర్‌బీఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టి నష్టపోయాడు.

మూడేళ్ల పాటు వడ్డీ ఇవ్వడంతో నమ్మిన జనం

జనాల వద్ద అధిక వడ్డీకి డబ్బులు తీసుకున్న బాలాజీనాయక్ వారికి మూడేళ్లకు పైగా వడ్డీ చెల్లించాడు. అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు.. మళ్లీ కొత్త వారి వద్ద అప్పులు చేశాడు. ఆరు నెలలుగా వడ్డీ ఇవ్వకపోవడంతో అప్పు ఇచ్చిన వారు బాలాజీనాయక్‌ను నిలదీస్తుండడంతో తప్పించుకు తిరుగుతున్నాడు. బాధితులు ఫిర్యాదు చేయడంతో బాలాజీనాయక్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

డిపాజిట్ యాక్ట్ కింద కేసు నమోదు..

నిందితుడు బాలాజీనాయక్‌పై డిపాజిట్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అతని బంధువులు, బినామీల పేరున ఎలాంటి ఆస్తులు ఉన్నాయనేది విచారణ చేస్తామని వివరించారు. బాలాజీనాయక్‌ను రిమాండ్ చేసిన తర్వాత మళ్లీ కస్టడీలోకి తీసుకుని విచారించి ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని వెల్లడించారు. అతని సెల్‌ఫోన్‌లో ఉన్న సమాచారం ఆధారంగా 106 మంది నుంచి రూ.46 కోట్లు తీసుకున్నట్లు ప్రాథమికంగా తేలిందని తెలిపారు. అతనికి 4 కార్లు ఉండగా.. ఒక పర్చునార్‌కారు, స్కార్పియో సీజ్ చేశామని, ఆస్తులకు సంబంధించిన పత్రాలు, మిర్యాలగూడ, హయత్‌నగర్, నేరేడుచర్ల, పలు తండాల్లో ఇళ్లు, దామరచర్ల, వద్దిపట్లలో వ్యవసాయ భూములకు సంబంధించి రాసిచ్చిన ప్రామిసరి నోట్లు 36, 7 సెల్‌పోన్లు స్వాధీనం చేస్తున్నామని తెలిపారు. బాధితులు ఎవరైనా.. ఎంత మొత్తం ఇచ్చారో.. ఆ వివరాలతో పీఏపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వాటిని కోర్టుకు సమర్పిస్తామని, డబ్బులు ఇచ్చిన వారికి చట్టపరంగా న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఏఎస్పీలు రమేష్, మౌనిక పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు పరిశీలిస్తున్న ఎస్పీ, ఏఎస్పీలు

బాలాజీపై 12 మంది ఫిర్యాదు

పెద్దఅడిశర్లపల్లి : అధిక వడ్డీ ఆశ చూపి అమాయక ప్రజలను మోసం చేసిన వడ్డీ వ్యాపారి బాలాజీపై శనివారం గుడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మండలంలోని పలు గ్రామాల నుంచి సుమారు 12 మంది బాధితులు ఫిర్యాదు చేసినట్లు గుడిపల్లి పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

యాదగిరీశుడి సేవలో టీజీపీఎస్సీ చైర్మన్



బుర్రా వెంకటేశంకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఇన్‌చార్జి ఈఓ రవినాయక్

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామిని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ అర్చకులు ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, ఇన్‌చార్జి ఈఓ రవినాయక్ లడ్డూ ప్రసాదం, స్వామివారి చిత్రపటం అందజేశారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



వెంకటేశం (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం పీపల్‌పహాడ్ గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పీపల్‌పహాడ్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు పులనగారి వెంకటేశం(55) రోజుమాదిరిగానే శనివారం కూడా కల్లు గీసేందుకు గ్రామ పరిధిలోని తాటిచెట్టు ఎక్కుతుండగా.. కాలు జారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తులు గమనించి పోస్టుమార్టం నిమిత్తం వెంకటేశం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశం కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని గీత కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు రాగీరు కిష్టయ్య కోరారు.

చికిత్స పొందుతూ..



వెంకన్న (ఫైల్)


తుంగతుర్తి : తాటిచెట్టుపై నుంచి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు శనివారం మృతిచెందాడు. తుంగతుర్తి మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు గూడ వెంకన్న(48) ఈ ఏడాది మే నెలలో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి మంచానికే పరిమితమైన వెంకన్న.. శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

మిర్యాలగూడ అర్బన్: వ్యభిచార గృహంపై శనివారం రాత్రి పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో నివాసముంటున్న రమావత్ విజయ, ఆమె కుమారుడు రమావత్ వినోద్ రాథోడ్ కలిసి వ్యభిచార గృహం నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి మహిళను, విటుడిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.1500 నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక యాక్టీవా వాహనం, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతిభ చాటితే భవిష్యత్తుకు ఉపకారం

- ఈ నెల 14వ తేదీ వరకు ఎన్‌ఎంఎంఎస్ దరఖాస్తునకు గడువు
- ఏడాదికి రూ.12వేల చొప్పున నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్



తిరుమలగిరి(తుంగతుర్తి): చురుకుదనం, తెలివితేటలు, చదువుపై మంచి పట్టున్న విద్యార్థులు ఆర్థిక కారణాలతో చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2008 నుంచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీం(ఎన్‌ఎంఎంఎస్) అమలు చేస్తోంది. 2025–26 విద్యాసంవత్సరానికిగాను ఈ స్కాలర్‌షిప్ స్కీంకు దరఖాస్తు చేసుకునేందుకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా ఈ నెల 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో ఈ స్కీం కింద ఎంపికైన విద్యార్థులకు ఏటా రూ.6వేల చొప్పున 9, 10, ఇంటర్ మొదటి, రెండో సంవత్సరాల్లో కలిపి రూ.24వేలు అందించేది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఈ ఉపకార వేతనాన్ని రెండింతలు చేసింది. ఏటా ఇచ్చే మొత్తాన్ని రూ.12వేలకు పెంచింది. అంటే నాలుగేళ్లకు కలిపి విద్యార్థులు రూ.48వేలు అందుకోనున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నవంబర్ 23న అర్హత పరీక్ష నిర్వహిస్తారు.

చొరవ చూపితే ఎంతో లబ్ధి

ఈ స్కీం గురించి సరైన ప్రచారం లేకపోవడం ఫలితంగా విద్యార్థులు ఎక్కువగా లబ్ధి పొందడం లేదు. 7వ తరగతిలో ఓసీ, బీసీ విద్యార్థులు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం మార్కులు పొంది, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.3.50లక్షల లోపు కలిగి ఉన్న వారంతా అర్హులు. 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పాటు ఆధార్, ఆదాయ, కుల, నివాసం ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన లేకపోవడంతో ఈ పరీక్ష రాసేందుకు ముందుకు రావడం లేదని, ఉపాధ్యాయులు చొరవ చూపడం లేదనే విమర్శలున్నాయి. ఉపకార వేతనం రెట్టింపు కావడం, నోటిఫికేషన్ విడుదల కావడంతో విద్యాశాఖ అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరముంది.

రాత పరీక్ష ఇలా..

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 3 గంటల పాటు రెండు విభాగాలుగా పరీక్ష నిర్వహిస్తారు. మొదటి విభాగంలో మెంటల్ ఎబిలిటీ టెస్ట్ 90 ప్రశ్నలు(90 మార్కులు) ఇస్తారు. ఇందులో వెర్బల్, రీజనింగ్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. రెండో విభాగంలో స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ 90 ప్రశ్నలు(90 మార్కులు) ఇస్తారు. ఇందులో గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంపై ప్రశ్నలు ఉంటాయి. 7వ తరగతిలోని పూర్తి సిలబస్, 8వ తరగతిలోని సగం సిలబస్‌పై ప్రశ్నలు అడుగుతారు.

నేడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభ

- తుంగతుర్తికి రానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ, దామోదర్‌రెడ్డి తనయుడు సర్వోత్తంరెడ్డి

తుంగతుర్తి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంతాప సభను తుంగతుర్తి మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతున్నట్లు సూర్యాపేట ఎస్పీ నరసింహ తెలిపారు. మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని శనివారం ఎస్పీ పరిశీలించారు. అనంతరం దామోదర్‌రెడ్డి తనయుడు సర్వోత్తంరెడ్డితో కలిసి సంతాప సభ ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, ఆర్డీఓ వేణుమాధవ్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్, సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

- జాతీయ స్థాయికి ఎంపికైన వారిలో నల్లగొండ బాలిక

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అండర్–14 ఎస్‌జీఎఫ్ తైక్వాండో టోర్నీ శనివారం ముగిసింది. బాలబాలికలకు వివిధ కేటగిరీల్లో తైక్వాండో పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు బంగారు, రజత, కాంస్య పతకాలు అందించారు. పోటీల్లో మనస్విని(నిజామాబాద్), జువేరియా కుల్‌సుమ్(నల్లగొండ), సమన్విత(రంగారెడ్డి), కతిజాఫాతిమా(నిజామాబాద్), మగేశ్ మెహరిన్(రంగారెడ్డి), హారిక(రంగారెడ్డి), సమీక్ష(రంగారెడ్డి), టి.వైష్ణవి(హైదరాబాద్) బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. వీరు ఈ నెల 28 నుంచి నాగాలాండ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి పేర్కొన్నారు.

సాగర్ బీసీ గురుకులంలో మెడికల్ క్యాంపు

- హాజరైన పూర్వ విద్యార్థి, గురుకుల విద్యాలయాల సెక్రటరీ సైదులు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న గురుకుల విద్యాలయాల సెక్రటరీ సైదులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శనివారం 25వ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల పూర్వ విద్యార్థి, గురుకుల విద్యాలయాల సెక్రటరీ బి. సైదులు హాజరై మెడికల్ క్యాంపును ప్రారంభించారు. తాను చదువుకున్న పాఠశాల కావడంతో సైదులు తన గురువులను, స్నేహితులను, జూనియర్లను కలుసుకుని ఆప్యాయంగా పలకరించారు. మెడికల్ క్యాంపులో పాల్గొన్న వైద్యుల సేవలను అభినందించారు. అనంతరం పాఠశాల తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. బోధనోపకరణాలు ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. 10వ తరగతి విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా కృషి చేయాలని ఆర్‌సీఓ స్వప్న, ప్రిన్సిపాల్ రవికుమార్‌కు సూచించారు. సాగర్‌లో డిగ్రీ కళాశాల కొత్త భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు నిడమనూరులో తాత్కాలికంగా తరగతులు కొనసాగించి, అనంతరం ఇక్కడకు మారస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, చిట్ల చక్రపాణి, శివాజీ, సైదులు, కొత్తపల్లి నితీష్, సరిత, హెల్త్ సూపర్‌వైజర్ రజిని, పీఈటీ నర్సింహ, పీడీ అరుణజ్యోతి, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలతో ఏఎస్సై బలవన్మరణం



సత్యనారాయణగౌడ్ (ఫైల్)

సూర్యాపేటటౌన్ : అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఏఎస్‌ఐ ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన శనివారం సూర్యాపేట పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం పోలీస్‌స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్ ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న గోపగాని సత్యనారాయణగౌడ్(53) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వివి ఎన్‌క్లేవ్ టౌన్‌షిప్‌లో నివాసముంటున్నారు. ఆయన కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొన్నారు. ఆత్మహత్య వార్తతో సహచరుల్లో విషాదం నెలకొంది. ఈ సంఘటనపై సత్యనారాయణగౌడ్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సూర్యాపేట రూరల్ ఎస్‌ఐ బాలునాయక్ తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

ఆహార భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి

- నాబార్డ్ డీడీఎం రవీందర్‌నాయక్



మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

గరిడేపల్లి: ఆహార భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందని, ఇందు కోసం రైతులకు ఉపయోగపడేలా అనేక పథకాలను, సబ్సిడీలను అందిస్తుందని నాబార్డ్ డీడీఎం డి. రవీందర్‌నాయక్ అన్నారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నీటిపారుదల సౌకర్యాలను మెరుగుపర్చడం, రైతులకు సులభతర రుణాల కల్పన మొదలైన అంశాలతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకొచ్చింది. దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేసేందుకు గాను ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకంతో పాటు పప్పుధాన్యాల స్వావలంబన మిషన్‌ను శనివారం ప్రారంభించారు. గరిడేపల్లి మండలం గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారానికి నాబార్డ్ డీడీఎం రవీందర్‌నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు కూడా ఒకే పంటపై ఆధారపడకుండా కూరగాయలు, పండ్ల మొక్కలు, పెరటి కోళ్లు, పశువులు, చేపల పెంపకం చేపట్టి అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి డివిజన్ ఏడీఏ రమేష్‌బాబు, హుజూర్‌నగర్ ఏడీఏ రవినాయక్, కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డి. నరేష్, కేవీకే శాస్త్రవేత్తలు డి. నరేష్, సీహెచ్. నరేష్, ఎ. కిరణ్, ఎన్. సుగంధి, కంప్యూటర్ ప్రోగ్రామర్ ఎ. నరేష్, వెటర్నరీ ఆఫీసర్ ఈ. కిరణ్, మండల వ్యవసాయ అధికారి ప్రీతమ్‌కుమార్, సందీప్, అనిల్, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇఫ్కో కంపెనీ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి..



ఉప్పలయ్య (ఫైల్)

గుండాల: కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండల కేంద్రానికి చెందిన శ్రీరాముల ఉప్పలయ్య(57) హైదరాబాద్‌లో నివాసముంటూ కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 8న ఇంట్లో గొడవ పడి స్వగ్రామానికి వచ్చి పురుగుల మందు తాగి.. కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి చిన్న కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎం. తేజంరెడ్డి తెలిపారు.

బస్సు ఢీకొని వ్యక్తి మృతి

సూర్యాపేటటౌన్: బైక్‌ను వెనుక నుంచి బస్సు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా పెనుబల్లి గ్రామానికి చెందిన వంటిపులి నర్సింహరావు(40) సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సుధాకర్ పీవీసీ కంపెనీలో పనిచేస్తూ కుడకుడలో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. శనివారం ఉదయం బైక్‌పై కంపెనీకి వెళ్తుండగా కొత్త వ్యవసాయ మార్కెట్ క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లగానే హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు నర్సింహరావు బైక్‌ను అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహరావు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

భువనగిరిటౌన్ : బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన భువనగిరి పట్టణంలో శనివారం జరిగింది. వివరాలు.. యాకూబ్ అనే వ్యక్తి బైక్‌పై భువనగిరి పట్టణంలోని పహాడీనగర్ నుంచి జగదేవ్‌పూర్ చౌరస్తాకు వస్తుండగా.. ఆర్‌కే ఆస్పత్రి వద్దకు రాగానే వెనుక నుంచి కారు వచ్చి ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన యాకూబ్‌ను స్థానికులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు అపహరణ

హాలియా : ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిపై ఓ దుండగుడు దాడి చేసి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును అపహరించుకెళ్లాడు. ఈ ఘటన అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన అయితగోని సాంబయ్య, సత్తమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. అందరికీ వివాహాలు కావడంతో గ్రామంలోనే ఈ వృద్ధ దంపతులు వేరుగా నివాసముంటున్నారు. సత్తమ్మ ఇంట్లోనే ఉంటుండగా ఆమె భర్త సాంబయ్య కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 10న సాంబయ్య కూలీ పనులకు వెళ్లగా.. సత్తమ్మ ఇంట్లో ఒంటరి ఉంది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఓ దుండగుడు ఇంట్లోకి ప్రవేశించి సత్తమ్మపై దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడు అపహరించుకుని పారిపోయాడు. సాంబయ్య సాయంత్రం ఇంటికి వచ్చేసరికి సత్తమ్మ గాయాలతో అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని చూసి కుటుంబ సభ్యుల సాయంతో హాలియాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. సీఐ సతీష్‌రెడ్డి, ఎస్‌ఐ సాయి ప్రశాంత్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సత్తమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నల్లగొండకు తరలించారు. నరేందర్ అనే వ్యక్తి తనపై దాడి చేసినట్లు బాధితురాలు సత్తమ్మ పోలీసుల విచారణలో పేర్కొనట్లు తెలిసింది. బాధితురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

బంగారం కోసమేనా..?

సత్తమ్మకు ముగ్గురు కుమారులు సంతానం కాగా.. వారిలో ఒక కుమారుడి పేరు నరేందర్ కావడంతో పోలీసులు పలువురు అనుమానితులను విచారిస్తున్నట్లు సమాచారం. బంగారం కోసమే ఈ అఘాత్యానికి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



తెలుగు సాహిత్యంలో ఒక కొత్త ప్రవాహాన్ని సృష్టించారు ఆచార్య సూర్యాధనంజయ్. జానపద గిరిజన సాహిత్యాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, బంజారా సమాజపు స్వరాన్ని తెలుగు సాహిత్యంలో ప్రతిధ్వనింపజేసిన ప్రథమ మహిళా పండితురాలు ఆమె. జీవితమంతా సాహిత్యం, సమాజం, సంస్కృతి ఈ మూడింటి మధ్యే గడుపుతున్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీకి ఆమె వైస్ ఛాన్స్‌లర్‌గా పనిచేస్తున్నారు. నల్లగొండ జిల్లా నుంచి వీసీగా నియమితులైన తొలి మహిళ ఆచార్య సూర్యాధనంజయ్.

స్ఫూర్తి

సాహిత్య కిరణం.. సూర్యాధనంజయ్

- బంజార సాహిత్యంపై తెలుగులో ఆమెదే తొలి పీహెచ్‌డీ
- వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా విధులు
- ఐదు జాతీయ, 24 రాష్ట్ర స్థాయి అవార్డులు ఆమె సొంతం
- మారుమూల తండా నుంచి ఉన్నత స్థాయికి ఎదిగిన గిరిజన మహిళ



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో వైస్ చాన్స్‌లర్ సూర్యాధనంజయ్

రామగిరి(నల్లగొండ) : సూర్యాధనంజయ్ నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ సమీపంలోని భల్లునాయక్‌తండా గిరిజన కుటుంబంలో జన్మించారు. చిన్ననాటి నుంచే పుస్తకాలపై మక్కువ, భాషపై ఆసక్తి కలిగిన ఆమె.. విద్యను ఉన్నతస్థాయికి తీసుకెళ్లాలని సంకల్పించారు. 1994లో బీఏ పూర్తి చేశారు. ఆ తర్వాత బీఈడీ, ఎంఏ(తెలుగు), బీఎల్ ఐఎస్సీ, ఎంఫిల్ (తెలుగు) పట్టాలను అందుకున్నారు. 2006లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. 'బంజారా సాహిత్యం – జీవన చిత్రణ' అనే శీర్షికతో బంజారాల సాహిత్యంలోని సామాజిక, సాంస్కృతిక అంశాలను విశ్లేషణ చేసి, పరిశోధనా ప్రబంధంతో డాక్టరేట్ సాధించి, తెలుగు ప్రపంచంలో తొలి పీహెచ్‌డీ పొందిన బంజారా మహిళగా చరిత్ర సృష్టించారు. 2013లో అమెరికన్ ఫోక్లోర్ సొసైటీ సెమినార్‌లో బంజారాల సాహిత్యంపై తన వాణి వినిపించారు.

ఎన్నో రచనలు..

విద్యాబోధన, పరిశోధనలతోపాటు ఎన్నో సాహిత్య, సృజనాత్మక రచనలు చేశారు. కథలు, కవిత్వం, అనువాదం, విమర్శనాత్మక వ్యాసాలతో దాదాపు పది పుస్తకాలు రాశారు. 10, 12 పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. వివిధ పత్రికలు, జనరల్లకు ప్రధాన సంపాదకులుగా, సంపాదకులుగా వ్యవహరించారు. ఆమె రచనల్లో బంజారా మహిళల ఆత్మగౌరవం, సామాజిక నిరోధాలకు వ్యతిరేక పోరాటం, జానపద సాహిత్య తాత్విక విశ్లేషణ, భాషా మౌలికత, సంప్రదాయ రక్షణ, ఆధునికతలో స్థానాన్ని నిర్ణయించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. బంజారా భాష గోర్‌బోలిని తెలుగు సాహిత్య ప్రవాహంలో చేర్చే ప్రయత్నం చేశారు.

26 ఏళ్ల బోధనానుభవం



కాకోటి బంజార సంస్కృతి సాహిత్య గ్రంథావిష్కరణ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో సూర్యాధనంజయ్

సూర్యాధనంజయ్ 1999లో ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో చేరారు. 2007లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2010లో ప్రొఫెసర్‌గా, 2023లో సీనియర్ ప్రొఫెసర్‌గా పదోన్నతులు పొందారు. ఆ తర్వాత 2024లో వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ (తెలంగాణ మొదటి మహిళా విశ్వవిద్యాలయం)కి తొలి వైస్ ఛాన్స్‌లర్‌గా నియమితులయ్యారు.

పలు కమిటీల్లో చోటు

ఆచార్య సూర్యాధనంజయ్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో ప్రొఫెసర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు. బోధనతో పాటు పరిశోధనలో కూడా ముందుండి రూసా, యూజీసీ నిధులతో రెండు మేజర్ ప్రాజెక్టులను పూర్తిచేశారు. ఇప్పటివరకు తన పర్యవేక్షణలో 25 డాక్టరేట్ డిగ్రీలు ప్రదానం చేయబడ్డాయి. నాలుగు పోస్ట్ డాక్టోరల్ ప్రాజెక్టులు పూర్తి చేయబడ్డాయి. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, నల్లగొండ, పాలమూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా ఉన్నారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు సభ్యురాలిగా నియమించబడ్డారు. మహిళా అచీవర్స్ రాష్ట్ర అవార్డు, దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ నారాయణ రావు పురస్కారం రాష్ట్ర అవార్డు ఎంపిక కమిటీలో సభ్యురాలుగా నియమించబడ్డారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార ఎంపిక కమిటీలో, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా ఉన్నారు.

ఎన్నో అవార్డులు

ఆచార్య సూర్యాధనంజయ్ సాహిత్య, సామాజిక, విద్యా రంగాలకు చేసిన కృషికి గుర్తింపుగా అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. ఇప్పటివరకు ఆమె 5 జాతీయ స్థాయి అవార్డులు, 24 రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నారు.



విశిష్ట మహిళా పురస్కారం అందుకుంటున్న సూర్యాధనంజయ్

అక్షరంతో వచ్చిన గుర్తింపు స్ఫూర్తినిస్తుంది

ఒకసారి వెనుకకు తిరిగి చూస్తే ఒక మారుమూల తండా నుంచి వచ్చి నేను ఇన్ని ఎలా సాధించానని ఆశ్చర్యం కలుగుతుంది. బంజారా సమాజానికే కాదు, మహిళాలోకానికి ఆదర్శంగా ఉండాలనేది నా సంకల్పం. అనుకున్న లక్ష్యానికి చేరడానికి ఇనుప కంచెలు సైతం తొలగించుకుని దాన్ని పూల హారంగా మలచుకోవాలి. ఆడపిల్లలకు బాహ్య సమాజంతోపాటు కుటుంబ ప్రోత్సాహం చాలా అవసరము. కృషి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు.

– ఆచార్య సూర్యాధనంజయ్

తాను చనిపోతూ ఆరుగురికి ప్రాణదానం

- బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవాలు దానం చేసిన తల్లిదండ్రులు



సైదులు (ఫైల్)

మోటకొండూర్: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి పడడంతో యువకుడి బ్రెయిన్ డెడ్ కాగా.. అతడి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వివరాలు.. మోటకొండూర్ మండలం చాడ గ్రామానికి చెందిన గంధమల్ల సైదులు(27) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 2న దసరా పండుగ రోజు సాయంత్రం గ్రామంలో జమ్మికి వెళ్లి తిరిగి తన బైక్‌పై ఇంటికి వస్తుండగా.. అదుపు తప్పి కంకర రాళ్లపై పడ్డాడు. దీంతో అతడి తల వెనుక భాగంలో బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సైదులు మృతి చెందాడు. సైదులు తల్లిదండ్రులు లక్ష్మి, రాములుకు జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు అవయవ దానంపై అవగాహన కల్పించటంతో వారు అతడి అవయవాలు దానం చేసేందుకు అంగీకరించారు. ఈ మేరకు సైదులు శరీరం నుంచి 2 కిడ్నీలు, 2 కార్నియాస్, కాలేయం, గుండెను సేకరించి మరో ఆరుగురికి అమర్చినట్లు జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సైదులు భౌతికకాయాన్ని శనివారం గ్రామానికి తీసుకురాగా ఆయన స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు పెద్దఎత్తున ర్యాలీ తీసి అంత్యక్రియలు నిర్వహించారు.